క్లుప్తంగా

ఘనంగా ఏకాదశి పూజలు


సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో గల రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక వ్రతాలను అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వుయ్ లవ్ రీడింగ్‌కు స్పందన


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. లైబ్రరీలో ఉన్న పరమానంద శిష్యుల కథలు, బాలమిత్ర, బాల భారతం, బాల రామాయణం, తదితర కథల పుస్తకాలను విద్యార్థులు చదివారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు లైబ్రేరియన్ వై.మహేష్ అల్పాహారం అందించారు.

ఎస్మా ప్రయోగం సరికాదు..


జీఓ కాపీలు దహనం చేస్తున్న యూనియన్ నాయకులు,కార్మికులు

నెల్లిమర్ల: అంగన్‌వాడీ సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం సరికాదని సీఐటీయూ నాయకుడు టీవీ రమణ అన్నారు. ఎస్మాకు వ్యతిరేకంగా ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులు జీవో కాపీలు దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, కిల్లంపల్లి రామారావు, టి. బాబూరావు, బి. హరిబాబు, శ్రీను, రాము, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

సంతకవిటి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వి.రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. 10న వాలీబాల్ క్రీడలో పురుష జట్లు 23, మహిళా జట్లు 8, ఖో ఖో క్రీడలో పురుష జట్లు 6, మహిళా జట్లు 9, 11న కబడ్డీ క్రీడలో పురుష జట్లు 18, మహిళా జట్లు 8, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో పురుష జట్లు 17, మహిళా జట్లు 12 తలపడనున్నాయన్నారు. 18, 19, 20వ తేదీల్లో జరిగే క్రికెట్ పోటీల్లో 24 సచివాలయాల నుంచి 24 పురుష జట్లు తలపడనున్నాయన్నారు. గెలిచిన జట్లు నేరుగా నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయన్నారు. 24 సచివాలయాల పరిధిలో మిర్తివలస సచివాలయం నుంచి మాత్రమే మహిళా జట్టు క్రికెట్‌కు రిజిష్టర్ చేసుకోవడంతో వారు నేరుగా నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

సంతకవిటి: జవహర్ నవోదయ మోడల్ టెస్ట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన మండలంలోని శేషాద్రిపురం సంతోషి హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులను సిబ్బంది ఆదివారం అభినందించారు. జిల్లా స్థాయిలో 3, 7, 13, 14వ ర్యాంకులను వరుసగా బాదన చరణ్ తేజ, తమ్మినేని విద్యాధరిచ, దూబకుల సాత్విక్, రివ్వ హాసిని సాధించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


బూరాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం, లింగాలవలస, బూరాడ జంక్షన్లలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ దగ్గర పడుతుండడంతో రోడ్లపై ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎక్కడా ఏం ప్రమాదం జరగకుండా చూస్తున్నామన్నారు. వాహనదారులు పరిమితికి మించి స్పీడుగా వెళ్లరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. రాత్రి సమయాల్లో మద్యం సేవించి, వాహనాలు నడపకూడదన్నారు. మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీ ఏర్పాటు చేశామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చి, బంగారానికి మెరుగు పెడతాం, లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు ఇస్తామని చెబితే నమ్మి, మోసపోవద్దన్నారు.

‘విజయ సంకల్ప సాంఘిక్’ సదస్సుకు స్పందన


విజయ సంకల్ప సాంఘిక్ కార్యక్రమంలో వేదికపై ఆసీనులైన పెద్దలు


హాజరైన సేవకులు, ప్రజలు

విజయనగరం టౌన్: హైందవ చైతన్యమే భారత సంక్షేమం – భారత సంక్షేమమే విశ్వ కల్యాణం అనే నినాదంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన విజయ సంకల్ప సాంఘిక్ కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక అయోధ్య మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సునీల్ కుమార్ జైన్, సహ క్షేత్ర ప్రచారక్‌గా భరత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్‌కు 50కు పైగా ఉన్న అనుబంధ సంస్థలతో సుమారు లక్షా యాభైవేలకు పైగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. 25 వేలకు పైగా విద్యా సంస్థలు నడుపుతున్నట్లు తెలిపారు. మన దేశంలోనే కాకుండా 50కు పైగా దేశాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థకు 98 ఏళ్ల పూర్తయ్యాయన్నారు. సుమారు 500 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ కృష్ణంరాజు, రమణమూర్తి, చెరుకూరి శ్రీధర్‌బాబు, భరత్‌కుమార్, అనిల్‌కుమార్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన


రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, తదితరులు

పూసపాటిరేగ: స్థానిక సినిమా హాల్ సమీపంలో మధుర ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. సాధారణ వ్యాధులతో పాటు ఎముకలు, కీళ్లవ్యాధులు, బీపీ, సుగర్ వంటి వ్యాధుగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చేతుల మీదుగా రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుర ఫౌండేషన్ అధినేత శ్వేత, ఎంవీజీ శంకరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: ఉడాకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో గల 33/11 ఫీడర్, మహాలక్ష్మినగర్, సాయిబాబా టెంపుల్ 11కేవీ ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

10న కోడూరులో కోలాటం పోటీలు

బాడంగి: మండలంలోని కోడూరులో ఈ నెల 10వ తేదీన కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జి.కరుణ్‌కుమార్ తెలిపారు. దివంగత తెంటు భారతి జ్ఞాపకార్థం స్వర్ణభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ పోటీలను ప్రారంభించేందుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విచ్చేస్తున్నారని తెలిపారు.

కూరగాయల సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘం సభ్యులకు సంబంధించిన 10 సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ఫార్మా మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసుకోవడం, 365 రోజులూ ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి కూరగాయ మొక్కలు ఏ విధంగా పండించవచ్చో తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్–2 పార్వతమ్మ, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి


రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న యువత

నెల్లిమర్ల: యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా సర్వేశాఖ సహాయ సంచాలకుడు టి. త్రివిక్రమరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువత స్వచ్ఛందంగా ఇలాంటి కార్యక్రమాలు చేయటం శుభపరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో చౌదరి వెంకటరావు, నరేష్‌రెడ్డి, ఎ. శ్రీనివాసరావు, ఎం. చంద్రశేఖర్, సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు బి. వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పి. వెంకటరమణ, సభ్యులు టి. అశోక్, కె. సురేంద్ర, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి


ఎంపీలు కోవ లక్ష్మణ్, నరసింహారావులను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎంవీజీ ఈశ్వరరావు, తదితరులు

- శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

విజయనగరం టౌన్: శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీజీ ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు విశాఖలో ఆదివారం నిర్వహించిన శిష్టకరణాల ఆత్మీయ సమ్మేళనంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, ఎంపీలు డాక్టర్ కోవ లక్ష్మణ్, జీవీఎల్ నరసింహారావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ, శిష్ట కరణాలతో పాటు మరో ఐదు కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. బీసీలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంపీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలిండియా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు, రాష్ట్ర అధ్యక్షుడు పోలి మహంతి ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు రేగ సురేష్, వాండ్రంగి వెంకటేష్, ప్రభాత్‌కుమార్, వరప్రసాద్, గరివిడి సంఘ నాయకులు సతీష్, గోవిందరావు, చీపురుపల్లి నాయకులు ఆర్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

13న రంగోలి పోటీలు


రంగోలి పోటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ ఆస్పత్రి డైరెక్టర్ డి.రమేష్‌కుమార్, తదితరులు

విజయనగరం టౌన్: సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ గడిచిన 28 ఏళ్లుగా వాజీ చానల్ రంగోలి పోటీలు నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ఈ నెల 13న పోటీలు ఉంటాయని క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి డైరెక్టర్ డి.రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్ఆర్ఐ ఆస్పత్రి ప్రాంగణంలో రంగోలీ పోటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల్లో అంతర్లీనంగా దాగిఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసుకువచ్చేందుకే ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒకే వేదికపై 1200 మంది మహిళలు ముగ్గులు వేయనున్నారని తెలిపారు. విజేతలకు వాజీ చానల్ బహుమతులివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మధు, కేఆర్‌కే రాజు, కిశోర్, సముద్రాల గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి


జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి


బొండపల్లి: కొవ్వాడపేటలో సద్గురు దేవానంద సరస్వతి ఆరాధన మహోత్సవాలకు హాజరైన భక్తులు


బొండపల్లి: కొవ్వాడపేటలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ, వేదికపై నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు


బొండపల్లి: కొవ్వాడపేటలో సద్గురు దేవానంద సరస్వతి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకులు


బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న హరిత రహదారి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్


జామి: పుష్పగిరిలో గోదాదేవి అమ్మవారి పల్లకీ సేవ


జామి: జామిలో అయోధ్య అక్షతలు పంపిణీ చేస్తున్న సమరసతసేవా ఫౌండేషన్, హిందూ పరిషత్ సభ్యులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే గోదాదేవి అమ్మ వారి పల్లకీసేవ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకత కలిగిన రోజు కావడంతో ప్రతీ వారం పంచామృ తాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నా రు. ఆలయం వద్ద మధ్యాహ్నం దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పూజలు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులతో పాటు హరిత రహదారి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సంజయ్ దంపతులతో అర్చకులు పూజలు చేయించారు.

అయోధ్య అక్షతల పంపిణీ

జామి: అయోధ్య రామమందిరం ప్రతిష్ట నేపథ్యంలో బాలరాముడిని పూజించిన అక్షతలను సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జామి ,భీమసింగి తదితర గ్రామాల్లో ఆదివారం పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య రామజన్మభూమిలో రామమందిరం ప్రతిష్టోత్సవం నిర్వహించనున్నా రని, ప్రజలంతా ఆహ్వానితులేనని సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. అక్షతలతో పాటు ఆహ్వాన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సమరసత సేవా ఫౌండేసన్ కన్వీనర్ మట్టా జనార్దన్, గౌరవ కన్వీనర్ బి.అప్పలరాజు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కన్వీనర్ కె.నాగభూషణం, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

బొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో దివ్య జీవన సంఘం విజయనగరం వారి ఆధ్వర్యంలో సద్గురు దేవానంద సరస్వతి 24వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ ఆధ్యాత్మిక బోధన ప్రవచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారిలో దాగి ఉన్న ద్వేషం, అసూయ విడనాడాలని, అందరితో ప్రేమగా ఉంటూ సోదర భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నవారు శత్రువు అయినా సరే వారికి చేతనైన సాయం అందించా లని చెప్పారు. అంతకు ముందు భక్తులతో కలిసి సద్గురు దేవానంద చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.